# తెర వెనుక

## యస్. వివేకానంద

"డోన్ట్ డిస్టర్బ్ మీ జయా! ఐ యామ్ వెరీ బిజీ!! ఈ వర్క్ ఫినిష్ చేస్తేగానీ రేపు ఆఫీసుకు స్కూటరుమీద వెళ్లలేను..." ఎడమ చేతిలో తెల్లరంగు చిన్నడబ్బీ... కుడి చేతిలో బ్రష్‌తో స్కూటర్ నెంబరు ప్లేటుమీదున్న నాలుగు అంకెలను పెద్దవిగా దిద్దుతూ విరు విసుగు ప్రదర్శించేడు అనిల్.

"ఏమిటండీ... మీరు మరీను!?... ఓ పది రూపాయలు పారేస్తే... పెయింటరేవరైనా చేసే పెడతారీపని... చేతనయ్ చేయకాకుండా మీరెందుకు అవస్థపడడం?... ఇందు... ముందే కాఫీ తీసుకోండి!!... వెంటనే తాగండి... లేకపోతే చల్లగ వుందనేసి నామీద విరుచుకుపడతారు... "స్కూటరు పక్కగా ఉన్న వెక్కబల్లమీద కాఫీగ్లాసు వుంచి ఇంట్లోకెళ్లిపోయింది జయ.

వంటెన కట్ బనీను.. నడుముచుట్టూ ఓ పాత టవలు... చేస్తున్న పనిపట్ల ఏకాగ్రత సన్నగిల్లుతున్న కారణంగా అప్పుడప్పుడు నొసలు చిట్లింపు... ఎలాగైనా వర్క్ ఫినిష్ చేయాలనే ఆరాటం... ఇన్నిటితో యాతన పడుతున్నాడు అనిల్.

పరంధామయ్యగారు చుట్ట వెలిగించి పంచపాళీలో కొచ్చి నిల్చుని కొడుకు చేస్తున్న పని తేరిపార చూస్తూ "ఎందుకురా అబ్బీ... డబ్బీలో రంగంతా నెంబరుప్లేటుకి పులుముతున్నావ్?..." ప్రశ్నించేడు.

"ప్రారబ్ధఖర్మ!... ఏం చెప్పమంటావ్?... నెంబర్‌ప్లేటుమీదున్న అంకెలు... పోలీసువారి కళ్లకు సరిగ్గా అవుపించడంలేదట! వీటిని పెద్ద చెయ్యకపోతే ఫైను!!... ఫైను కట్టలేకే ఈ అవస్త..." గోరువెచ్చగ వున్న కాఫీ తాగేసి మరీ చెప్పేడు తండ్రికేసి తలతిప్పకుండానే.

"ఇంకా నయం... తాటికాయలంత అక్షరాలతో... అంకెలతో వ్రాసిన నెంబర్ ప్లేట్ డ్రైవ్‌చేసేవారి మెడలో వ్రేలాడేసుకోవాలి అన్లేదు..." ఫకాలున నవ్వేడు పరంధామయ్య.

"నవ్వకండి నాన్నా... పోలీసు వారికి కోపమొస్తుంది. వారిని అవమానిస్తున్నామని మనపై చర్య తీసుకోగలు(రు)!!.."

"ఒరే!... నాకన్పిస్తుందీ... రాత్రికి రాత్రీ ఇలా చేయడానికిగల కారణం..." గుప్పుగుప్పుమని చుట్ట పొగ వదుల్తూ తటాలున ఆగిపోయాడు.

ప్రశ్నార్థకంగా తండ్రి ముఖంలోకి చూచేడు అనిల్.

నవ్వాపుకో ప్రయత్నిస్తూ "ఈ దిక్కుమాలిన రూలుకి కారణం ఏమై ఉండచ్చంటే... రంగుల కంపెనీవారు సేల్సు పెంచుకునేటందుకు... రాత్రికి రాత్రే పోలీసువారి కాళ్లమీద పడిపోయి వుంటారు. అంతో ఇంతో సమర్పించుకుని సాయపడమని వేడుకుని వుంటారు.. అక్కడితో పోలీసువారు... కార్ల స్కూటర్ల వారిపైవిరుచుకుపడివుంటారు..." జోక్ చేశాడు.

మామగారి సమయస్ఫూర్తికి అప్పుడే అక్కడికొచ్చిన జయ గలగలా నవ్వింది.

"నిజం జయా!... ప్రతి చిన్నదానికి పోలీసువారికి ఫైన్లు కట్టలేక యమ యాతన పడుతున్నామనుకో! లైటు లేకపోతే ఫైను! హెల్మెట్ లేకుంటే ఫైను... స్పీడుగా పోతే ఫైను... నెంబర్ ప్లేటు అంకెలు సరిగ్గా అవుపించకపోతే ఫైను... అబ్బబ్బ! వాట్ ఎ హెల్..." చేస్తున్న పని విజన్ మిర్రర్లో ముఖాన్నొకసారి చూచుకున్నాడు అనిల్. తెలుపు నలుపు రంగు తాలూకు చుక్కలతో ముఖం మేకప్ చేసుకున్నట్లనిపించింది.

"పెయింట్ నెంబర్ ప్లేటుకా... మీ ముఖానికా...?" జయ వుడికించింది.

"దిష్టిబొమ్మలా అవుపిస్తున్నారు..." చిన్నపిల్లలా నవ్వుతూ చప్పట్లు చరుస్తూ అంది జయే మళ్లీ.

"ఇదిగో... నాకు కోపం తెప్పించకు... అసలే బోర్‌గా వుంది..."

"అది సరేరా... అనిల్! హెల్మెట్లు పెట్టుకోమని ఎందుకు వేధిస్తున్నట్టూ?..." ఆరిపోయిన చుట్టపీకను దూరంగా విసిరేస్తూ అడిగేడు పరంధామయ్య.

"యాక్సిడెంట్ జరిగినప్పుడు కాలో చెయ్యో విరిగి వుద్యోగం పోగొట్టుకున్నపుడు... దాన్నే బొచ్చగా వాడుకుని అడుక్కుతినేటందుకు పనికిరాకపోతుందాని..." జయ ఠక్కున జవాబిచ్చింది.

"కాదు జయా! ఇది శిరస్త్రాణం! అంటే... తలకు రక్షణ ఇస్తుంది..." సిన్సియర్‌గా అన్నాడు అనిల్.

"అంటే యాక్సిడెంట్ జరిగినపుడు తల పగిలి చావకుండా! అంతేనా...? అంటే కాలో చెయ్యో విరిగినా ఫర్వాలేదన్నమాట?" కొంత కోపం మరికాస్త నవ్వు మిళితం చేసి అంది జయ.

"బాగానే వుంది సంబడం!... రోడ్లెలా వున్నాయో ఎవరికీ పట్టదు... గుంటలు... మిట్టలు... ఎత్తులు... పల్లాలు... రోడ్లు పగలగొట్టేవారేగాని... బాగుచేద్దామని ఎవ్వరికీ ఉండదు... ఇంట గెల్చి రచ్చ గెలవమన్నారు... ముందు అధ్వాన్నంగా వున్న రోడ్ల పరిస్థితి మెరుగుపర్చి ఆ పైన శిరస్త్రాణాలు... ఆభరణాల సంగతి ప్రభుత్వం పట్టించుకుంటే బావుంటుంది! అవునా?!?" పరంధామయ్య బుల్లి వుపన్యాసం దంచేడు.

అనిల్ కిక్కురుమనకపోవడం చూచిన పరంధామయ్య "ఎందుకొచ్చిన యాతన చెప్పు? స్కూటరు అమ్మిపారేసి హాయిగా సిటీబస్సుల్లో ఆఫీసుకు వెడితే ఎంత హాయిగా వుంటుంది ప్రాణానికి..." సలహా ఇచ్చేడు కొడుక్కు.

"సిటీ బస్సులోనా?! అంతకంటే సర్కస్ ఫీట్ మరొకటి వుండదు— ఎంచేతనంటే డాడీ... ఫుట్‌బోర్డు మీదున్న వారు లోపలికి వెళ్లనివ్వరు! లోపలున్నవారు దిగనివ్వరు!! ముసలి ముతకా... ఆడ మగా... పిల్లా జల్లల్ని తప్పించుకు బస్సు ప్రయాణం చేయాలంటే నేను ఆసనాలు వేయడం నేర్చుకోవాలిహ! ఈ బాధ పడలేకేగా డిపార్ట్‌మెంటిచ్చిన లోను పుచ్చుకుని ఎంచక్కా దీన్ని కొనుక్కున్నది!" పెయింట్ చేతులను కిరోసిన్‌గుడ్డతో తుడుచుకుంటూ పచ్చి నిజాన్ని మరోసారి చెప్పేడు అనిల్.

"ఏం బాబాయ్? ఏమంటోంది మనవాడి స్కూటరు?" అప్పుడే ప్రహరీగేటు తోసుకువచ్చిన పక్కింటి రామం ప్రశ్నించేడు పరంధామయ్యని చూచి.

"వీడి అవస్థ చూస్తుంటే స్కూటరుతో వీడు సుఖపడి ఏడ్చిందేమిటీ అన్పిస్తోంది... చూడు రామం! నువ్వు మాత్రం ఎటువంటి పరిస్థితుల్లోనైనా సరే... స్కూటర్ మాత్రం కొనుక్కోకు." ఉచిత సలహా ఇచ్చేడు పరంధామయ్య కొడుకు పడుతున్న అవస్థ కళ్ళారా చూస్తూ.

బాగానేవుంది సంబడం!... రోడ్లు ఎలావున్నాయో ఎవరికీ పట్టదు... గుంటలు ... మిట్టలు... ఎత్తులు.. పల్లాలు... రోడ్లు పగలగొట్టేవారేగాని... బాగుచేద్దామని ఎవరికీ వుండదు... ఇంటగెలిచి రచ్చగెలవమన్నారు..

"అదేమిటి మామయ్యా... అత్తవారే పెళ్లికి కానుకగా ఇచ్చారనుకో రామానికి... అప్పుడెలా వద్దనగలడు?" తమాషాగా చేతులు తిప్పుతూ అంది జయ.

"మోజుపడి అత్తవారే అంతగా ఇస్తామంటే దీనికి బదులుగా ఓ టీవీసెట్టో... ఫ్రిజ్జో... అడుగు!" మాట కలిపేడు అనిల్.

"అదేంటి బాబాయ్? నేటి సమాజంలో స్కూటరెక్కి తిరగడం ఓ స్టేటస్ సింబల్! పైపెచ్చు పెళ్లాన్ని వెనక్కూర్చోబెట్టుకుని సిటీ అంతా చుట్టిరావడం ఓ త్రిల్లు!!" రామం హుషారుగా మాట్లాడేడు.

"చుట్టచ్చు... యాక్సిడెంటయితే ఆస్పత్రిలో మంచం పట్టచ్చు!! అప్పుడు స్కూటరెక్కి మొగుడు వెనకాల కూర్చుని కితకితలు పెట్టిన పెళ్లాం... సపర్యలు మొగుడికి చెయ్యలేక నొసలు చిట్లిస్తుంది. మొగుడినే సాధిస్తుంది బ్రతికి వున్నన్నాళ్లా..."

"నువ్వు మరీ అంత ఇదిగా మాట్లాడడం ఏమీ బాగోలేదు బాబాయ్! నువ్వు ఈ తరం మనిషివి కాదుగాబట్టి అట్లా అన్పిస్తుంది..."

"ఏమిటోనోయ్... ధర మండిపోతూంటే పెట్రోల్ కొన్లేక ఒకవేపు... రోజుకో కొత్తరకం రూలు ప్రవేశపెట్టే పోలీసుల వేధింపుకు తట్టుకోలేక మరోవేపు చూస్తూంటే నాకే బాధగా వుంటోంది."

"ఏమిటి నాన్నా నువ్వు మరీను?! రామాన్ని ఎదుట పెట్టుకునే పోలీస్ డిపార్ట్‌మెంట్‌ని నిందించడం ఏం బావుంటుంది చెప్పు? వాళ్ల నాన్న ఎస్సైగదా? ఎంత ఫ్రెండైనా అఫెండవడూ?" మాట మార్చే ప్రయత్నంలో అన్నాడు అనిల్.

"అవునుకదూ? ఆ సంగతే గుర్తులేదు.. నేను అన్నానని నువ్వేమీ బాధపడకు రామం" నవ్వుచెప్పబోయాడు పరంధామయ్య.

ఇంతలో జయ కాఫీ తెచ్చి రామానికందించింది.

"వస్తూ ఇంట్లో తీసుకునే వచ్చాను చెల్లాయ్!"

"ఆఫ్టరాల్ కాఫీయేకదా! ఎన్నిసార్లయినా తాగచ్చు... కమాన్ టేకిట్..." అనిల్ బలవంతం చేసేడు.


"ఏమిటయ్యా... పరాయివాడిలా మొహమాటపడిపోతావ్... నేను మీ ఇంటికెన్నిసార్లొస్తే అన్నిమాట్లూ మీ అమ్మగారు ఇవ్వడం లేదూ..." పరంధామయ్య సమర్థించేడు.

ఇక తప్పదనుకుని సిప్ చేశాడు రామం!

"ఇందాకా మన సంభాషణ సగంలో ఆగిపోయిందిగదూ?... స్కూటరువాళ్లను పోలీసులు వేధించడంలోగల తెరవెనుక అసలు భాగోతం మీకెవ్వరికీ తెలియదు..." చెప్తూ చెప్తూ ఆగి కాఫీ తాగడంలో నిమగ్నమయ్యాడు.

ఆసక్తిగా అనిల్ పరంధామయ్య ఇద్దరూ తదేకంగా రామం ముఖంలోకి చూస్తూ వుండిపోయారు కొత్త విషయం చెప్పబోతున్నాడని.

"నాకూ రాత్రే తెల్సింది బాబాయ్... భోజనాలు చేస్తున్నప్పుడు మా డాడీ చెప్పారు..."



"సంగతేమిటో చెప్పవయ్యా... సస్పెన్సుతో చంపక!!" రామం తాగి అందించిన ఖాళీ కాఫీ గ్లాసు అందుకుంటూ వుత్కంఠతో అడిగింది జయ.

"మా డాడీ... గంటసేపు చెప్పిన విషయాన్ని ఒక్కమాటలో మీకు చెప్పాలీ అంటే మాటలా చెప్పండి బాబాయిగారూ..."

"అబ్బబ్బ నువ్వు మరీ చంపేస్తున్నావురా..." నెత్తిన మొట్టబోయాడు అనిల్.

"క్లుప్తంగా... తెలుగు కవితలాగ నాలుగు ముక్కల్లో చెప్పద్దులే! తెలుగు నవలలాగ వర్ణనతో సంభాషణతో పొడిగించి పొడిగించి మరీ చెప్పు అన్నయ్యా..." తెలుగు పత్రికలు చదవడంలో ఆరితేరిన జయ ఫక్కున నవ్వేసి అంది.

"మీరు అనవసరంగా టెన్షన్ ఫీలవకండి! చెవులు రిక్కించి నే చెప్పేది విని ఆనందించండి చాలు!! అసలేం జరిగిందంటే... రెండు రోజుల క్రితం.. యాబిడ్ సెంటర్లో ఒక స్కూటర్ యాక్సిడెంట్ జరిగింది. మంత్రిగారి అబ్బాయి కారుని ఓ స్కూటర్ గుద్దేసింది చాలక కంటికి అవుపించనంత స్పీడుగా దూసుకుని వెళ్లిపోయిందట స్కూటరు. ఇంకేముంది మంత్రిగారి పుత్రుడు వుగ్రుడయ్యాడు. బీట్ పోలీసులు ఆ స్కూటరు నెంబరేమిటోకూడా గుర్తించలేకపోయారు. రాత్రికి రాత్రి మంత్రిగారు సిటీ పోలీసు అధికారులతో అత్యవసర సమావేశం జరిపారు. స్కూటరు నెంబరు ఆనవాలు పట్టలేనందుకు పోలీసు డిపార్ట్‌మెంట్ తమ అశక్తతను వ్యక్తం చేసింది. వారి సమాధానం విన్న మంత్రివరేణ్యులు అగ్గి బుగ్గయ్యారు. స్కూటర్ల నెంబర్ ప్లేట్లు తాటికాయలంతేసి అక్షరాలతో వుండాలనేమంత్రిగారి అభిప్రాయాన్ని తక్షణం అమలుపరచాలని పోలీసు డిపార్టుమెంట్‌ని ఆదేశించడం జరిగింది. అదీ విషయం! దీనికారణంగానే స్కూటర్ ఓనర్లకి ఇన్ని తిప్పలు..." అనేసి గుక్క తిప్పుకోకుండా చెప్పాడు రామం.

"బావుందయ్యా బావుంది ఇదా తెరవెనుక కథ!?" పొలమారేట్టు నవ్వాడు పరంధామయ్య.

మిగతావాళ్లుకూడా పరంధామయ్య నవ్వుతో శృతికలిపేరు.

*